ప్రజాసంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- 'గడప గడపకు మనప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. జామి సచివాలయం-3 పరిధిలో సోమవారం 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల్లో వందల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఆ తర్వాత ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసగించారని, పేద ప్రజల సంక్షేమాన్ని పట్టించు కోలేదని గుర్తు చేశారు. సీఎం జగన్ సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రజలంతా ఆయన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్, మండల జేసీఎస్ మండల ఇన్‌చార్జి శీరెడ్డి చందునాయుడు, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఎంపీటీసీ సూరిదేముడు, నాయకులు కిలారి సూర్యారావు, అల్లు అప్పలనాయుడు, గొర్లె అప్పలనాయుడు, శిరికి నాగేశ్వరరావు, ఏ.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ ఎం.సతీష్, ఈఓపీఆర్డీ శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

వార్డు సభ్యుల ఉప ఎన్నికకు నోటిఫికేషన్


వేపాడ: వార్డు సభ్యుల ఎన్నికపై అధికారులతో సమావేశమైన ఎంపీడీఓ పట్నాయక్

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి పంచాయతీలో రెండో వార్డు, తుమ్మికాపల్లి పంచాయతీలో మూడో వార్డు సభ్యులు మృతి చెందడంతో ఆ స్థానాలకు ఉప ఎన్నిక నిర్వహణకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.ధర్మారావు సోమ వారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈరెండు స్థానాలు జనరల్ మహిళలకు రిజర్వ్ చేసినట్లు తెలిపారు. 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్‌ల స్వీకరణ,11న స్క్రూటినీ, 14న నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందని, అదే రోజు సాయంత్రం బరి లో నిలిచిన అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తామని చెప్పారు.19వ తేదీన ఎన్నిక, కౌంటింగ్ ఉంటుందని తెలిపారు.

మూడు వార్డులకు ఎన్నికలు

గుర్ల: మండలంలోని దేవునికణపాకలో 8వ వార్డు, గొలగాం- 8, వల్లాపురం-8వ వార్డులకు ఉప ఎన్నికల నిర్వహణకు ఎంపీడీఓ కల్యాణి సోమ వారం నోటిఫికేషన్ జారీ చేశారు. మంగళవారం నుంచి గురువారం వరకు నామినేషన్ల స్వీకరణ, 19న పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వేపాడ మండలంలో..

వేపాడ: మండలంలోని పలు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నిక నిర్వహించేందుకు ఎంపీడీఓ పట్నాయక్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఎన్నికల నిర్వహణపై ఎంపీడీఓ చర్చించారు. 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్‌ల స్వీకరణ, 19న పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

గద్దర్ మృతి తీరని లోటు

చీపురుపల్లి: ప్రజాగాయకుడు గద్దర్ మృతి సమాజానికి తీరనిలోటని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ వద్ద జనవి జ్ఞానవేదిక, ఆశయ సంస్థ ఆధ్వర్యంలో గద్దర్ సంతాపసభను సోమవారం నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి ఆశయసంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు, ఉపాధ్యాయులు వావిలపల్లి మోహనరావు, మంతిన సుశీల, సత్యశ్రీనివాస్, నడిపేన బలరాం, రమణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గద్దర్ తన పాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని అన్నారు.


గద్దర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు

మెగా వైద్యశిబిరం రేపు

చీపురుపల్లి: లయన్స్‌క్లబ్, స్టార్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఈనెల 9న పట్టణంలోని బీఎస్ లయన్స్ కమ్యునిటీ హాల్‌లో మెగా వైద్యశిబిరం నిర్వహించనున్న ట్లు ఆ క్లబ్‌ల ప్రతినిధులు ఎస్.వి.దుర్గారావు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రాగోలులోని జెమ్స్ ఆస్పత్రి వారి సహ కారంతో ఈశిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో సాధారణ వ్యాధులు, బీపీ, సుగర్, డెంటల్, ఇతర సమస్యలు ఉన్న వారికి జెమ్స్ వైద్యులు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలు, మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారిని జెమ్స్‌కి రిఫర్ చేసి అక్కడ ఉచితంగా వైద్యసేవలు అందిస్తారని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపటి నుంచి 'నేలతల్లికి నమస్కారం'

లక్కవరపుకోట/కొత్తవలస: నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా ఈనెల 9వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 'నేలతల్లికి నమస్కారం -వీరులకు వందనం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కొత్తవలస, లక్కవరపుకోట ఎంపీడీఓలు వై.పద్మజ, జి.జ్ఞానేశ్వరరావు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన స్థానిక మహనీయులు, సాహసవంతులు, వీరులను స్మరించు కోవాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సందేశాలతో పాటు దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, త్యాగధనుల పేర్లతో కూడిన శిలాఫలకాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

విశ్వకవికి ఘననివాళి

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయగీతం రచయిత, విశ్వకవి, నోబుల్ అవార్డ్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.ఈరన్న అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్ర పటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఠాగూరు బెంగాలీలో ఆయన రచించిన గీతాంజలి, తదితర రచనలు సమాజాన్ని ఉత్తేజపరిచాయని చెప్పారు.గీతాంజలి రచనలకు నోబుల్ పురస్కారం లభించిందని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో శ్రీనివాసుడు

విజయనగరం టౌన్: నగరంలోని టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో కొలువైన శ్రీనివాసుడు సోమవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు పీవీ.నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

జనసేనలోకి మాజీ మంత్రి అరుణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పడాల అరుణ

గజపతినగరం: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ మంత్రి పడాల అరుణ ఈనెల 10వ తేదీన జనసేన పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. గజపతినగరంలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు ఆశీస్సులతో 1985లో రాజకీయ ప్రవేశం చేశానని, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, మంత్రిగా, పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నో పదవులు చేపట్టానని చెప్పారు. అయితే గజపతినగరం నియోజకవర్గంలోని టీడీపీలో గ్రూపు రాజకీయాలు, వర్గవిభేదాలతో మనస్థాపానికి గురై ఆ పార్టీని వీడానని అన్నారు. 10వ తేదీన విశాఖలో పవన్ కల్యాణ్ సమక్షంలో అనుచరులతో కలిసి జనసేన పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు.

సోంపురం హెచ్‌ఎం ప్రతిభ

వేపాడ: సోంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బీపీఏ రాజు ఐదు జిల్లాల్లోని వివిధ యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన పలు అంశాల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. గత నెల 31 నుంచి ఈ నెల 5వ తేదీవరకు బీమిలిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని వివిధ యాజమాన్యాల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు నాయకత్వ లక్షణాల పెంపుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో పాఠశాల భద్రత, హాజరు నమోదు పెరుగుదల, అభ్యసనా సామర్థ్యాల పెంపు తదితర అంశాల్లో రాజు ఉత్తమ ప్రతిభ చూపి విద్యాశాఖ అధికారుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.


ప్రశంశాపత్రం అందుకుంటున్న రాజు

పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయమే మేలు


కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వేపాడ: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని జిల్లా ప్రకృతి వ్యవసాయం అధికారి సీహెచ్.వి.వి.వరప్రసాద్ అన్నారు.వీలుపర్తి,చిన గుడిపాల,రాయుడుపేట,ఎస్.కె.ఆర్.పురం, వేపాడ గ్రామాల్లో రైతులకు జీవామృతం, కషాయాల తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. వరుస క్రమంలో వరినాట్లు వేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. వీలుపర్తి, కుమ్మపల్లి క్లస్టర్ పరిధి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన


ఓటు వేసేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు


విద్యార్థి చేతికి సిరా గుర్తును పెడుతున్న ఎన్నికల సిబ్బందిగా పని చేసిన విద్యార్థి

లక్కవరపుకోట: ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణపై మండలంలోని గంగుబూడి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇన్‌చార్జి హెచ్‌ఎం జామి అప్పలరాజు ఆధ్వర్యంలో సోమవారం ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎస్పీఎల్ ఎన్నిక నిర్వహించారు. ముందుగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా, నలుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. వీరికి ఉపాధ్యాయులు గుర్తులు కేటాయించారు. అనంతరం అభ్యర్థులు తరగతి గదుల్లో ప్రచారం చేశారు. ఎన్నికల సిబ్బందిగా పలువురు విద్యార్థులను నియమించారు. బ్యాలెట్ బాక్సుల ఏర్పాటుతో పాటు విద్యార్థులకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేసి పోలింగ్ ప్రారంభించారు. విద్యార్థులంతా క్యూలో నిల్చొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం కౌంటింగ్ చేశారు. కె.కృప ఎస్పీఎల్‌గా ఎన్నికయ్యారు. రెండో స్థానంలో కె.హేమంత్ నిలిచారు. వీరితో ఉపాధ్యాయులు ప్రమాణస్వీకారం చేయించారు.


ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థిని


కౌంటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

అభినందన..


హాసినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గజపతినగరం: విజయవాడకు చెందిన గీతా యంగ్‌సైంటిస్ట్ ఆవిష్కార్ సంస్థ ఈ నెల 5న నిర్వహించిన ఆవిష్కార్ ప్రతిభా పోటీ పరీక్షలో మండలంలోని మరుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన జె. హాసినికి జాతీయ స్థాయిలో ప్రోత్సాహక బహుమతి వరించింది. దీంతో సోమవారం పాఠశాల ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వి. నాగమణి మాట్లాడుతూ, హాసిని భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


ఎంపీడీఓతో కలిసి మాట్లాడుతున్న వైద్యులు సంతోషిరూప, సతీష్‌కుమార్

దత్తిరాజేరు: జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు కె. కొత్తవలస, దత్తిరాజేరు పీహెచ్‌సీల వైద్యాధికారులు సంతోషి రూప, సతీష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంతో కలసి కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఏడాది నుంచి 19 సంవత్సరాల్లోపు ఉన్నవారందరికీ ఉచితంగా మాత్రలు అందించనున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో క్రమంతప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అదేవిధంగా వీధిలైట్లు వెలిగేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీజీఎస్ఎం. ప్రసాదరావు, ఎంపీడీఓ వైవీ రాజేంద్ర ప్రసాద్, ఈఓపీఆర్‌డీ సుగుణాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం


బాధితురాలికి బియ్యం బస్తాలు అందజేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: మండలంలోని చామలాపల్లి గ్రామంలో ఆదివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మిగడ లక్ష్మీకాంతాన్ని ఎంపీపీ సత్యవంతుడు సోమవా రం పరామర్శించారు. రెండు బస్తాల బియ్యం అందజేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, సర్పంచ్ కోలా సతీష్, స్థానిక నాయకులు గంగాధర్, గ్రామ పెద్దలు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'


వివిధ శాఖల అధికారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

గజపతినగరం: ప్రజాసమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

ఆటల పోటీలకు పేర్లు నమోదు చేసుకోండి

దత్తిరాజేరు: సచివాలయాల స్థాయిలో నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలని ఎంఈఓ -2 సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 సంవత్సరాలు నిండిన యువత ఈ నెల పదో తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్, ఖోఖో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. సచివాలయ స్థాయి విజేతలను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. క్రీడాసామగ్రి ప్రభుత్వమే సమకూరుస్తుందని, ఆసక్తి ఉన్నవారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఓటమి భయంతోనే హింసను ప్రేరేపిస్తున్నారు

- పుంగనూరు విధ్వంసకాండకు చంద్రబాబే బాధ్యుడు
- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: రానున్న ఎన్నికల్లో గెలుస్తామనే నమ్మకం లేకనే టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో హింసను ప్రేరేపిస్తూ, అలజడులు సృష్టిస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. పుంగనూరు ఘటనపై మండల కేంద్రం జామిలో సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల మద్దతు రోజు రోజుకూ పెరుగుతోందని, దీన్ని ఓర్వలేక చంద్రబాబునాయుడు కుట్రరాజకీయాలు చేస్తున్నారని, అదే ఆయన నైజమన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలవలేమని తెలిసే చంద్రబాబు, టీడీపీ నాయకులు ఈవిధమైన అరాచకాలకు పాల్పడుతు న్నారని ఆరోపించారు. పుంగనూరు పర్యటన షెడ్యూల్‌లో లేకపోయినా, గొడవలు సృష్టించేందుకు చంద్రబాబు అక్కడికి వెళ్లారని అన్నారు. పోలీసులపై తన కిరాయిమూకలతో దాడులు చేయించారని మండిపడ్డారు. ఒక వేళ పోలీసులు కాల్పులు జరిపితే, ఆ ఘటనలో టీడీపీ కార్యకర్తలు చనిపోతే వారితో శవరాజకీయాలు చేయాలని చంద్రబాబు తాపత్రయపడ్డారని అన్నారు. పోలీసులు సంయమనంతో వ్యవహరించి చంద్రబాబు వ్యూహం అమలు కాకుండా తమ రక్తాన్నే చిందించారే తప్ప కాల్పులు జరపలేదన్నారు. లోకేష్, పవన్‌కల్యాణ్ కూడా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో వీరంతా కులాలు, మతాల పేరుతో అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. చంద్రబాబు ప్రజల్లోకి వెళ్లి తాను గతంలో చేసిన కార్యక్రమాలను, మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తామన్నది చెప్పాలే కాని ఇటువంటి మార్గం ఎంచుకోవడం సరికాదన్నారు. వైస్‌ఎంపీపీ గేదెల వెంకటరావు, స్థానిక సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, మండల జేసీఎస్ కన్వీనర్ శీరెడ్డి చందునాయుడు, నాయకులు కిలారి సూర్యారావు, లగుడు దేముడు,అల్లు సత్యాజీ తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ప్రజాశ్రేయస్సే పరమావధి

మెరకముడిదాం: ప్రజాశ్రేయస్సే పరమావధిగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నా యకులు తాడ్డి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని రామాయవలస గ్రామంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్య క్రమం నిర్వహించారు. స్థానిక, మండల ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు.

నేడు ఎం.రావివలసలో...

మండంలోని ఎం.రావివలస గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీ డీఓ ఎం.రత్నం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారని, మండల అధికారులు, సంబంధిత సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.


రామాయవలసలో లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న, వేణుగోపాల్, రమణరాజు

వరుస నాట్లతో అధిక దిగుబడులు


వరి నాట్లు పరిశీలిస్తున్న అధికారులు హేమసుందర్ ,ప్రకాశ్, తదితరులు

బొండపల్లి: వరుస నాట్లతో వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారులు హేమసుందర్, ప్రకాశ్ అన్నారు. మండలంలోని బి.రాజేరులో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సేంద్రియ ఎరువులు వాడడంతో పాటు వరుస పద్ధతిలో నాట్లు వేయడం వల్ల చీడ పీడలను నివారించడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌సీఎస్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు రామకృష్ణ, అప్పలనాయుడు, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

- డాక్టర్ అనూజ్‌రాయ్

గజపతినగరం: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్‌రాయ్ అన్నారు. జిన్నాం సచివాలయ పరిధిలోని 99 మందికి సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఆరోగ్య కార్యకర్త ప్రసన్నకుమారి, ఆశా కార్యకర్తలు సంతోష్, గౌరి, తదితరులు పాల్గొన్నారు.


రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ అనూజ్‌రాయ్

హద్దురాళ్ల ఏర్పాటు పనుల పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా సర్వే అధికారి ప్రసాద్

కొత్తవలస: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా భూరీసర్వే పూర్తయిన కంటకాపల్లి గ్రామంలో హద్దు రాళ్ల ఏర్పాటు పనులను జిల్లా సర్వే అధికారి బి.ఎస్.ఎస్.ప్రసాద్ సోమవారం పరిశీలించారు. గ్రామంలో సుమారు 4వేల హద్దు రాళ్లను పాతుతున్నట్లు మండల సర్వేయర్ గంగాధర్ ఆయనకు వివరించారు. అనంతరం జిల్లా సర్వే అధికారి మాట్లాడుతూ మండలంలో భూరీసర్వే పనులను సమర్థవంతంగా నిర్వహించాలని, పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ టి.రమేష్‌కు ఆయన సూచించారు. రీసర్వే డీటీ కోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం

వేపాడ: తల్లి పాలు బిడ్డకు అమృతమని, బిడ్డకు ముర్రుపాలు పట్టించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. మండలంలోని చినగుడిపాల గ్రామంతో పాటు పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పలుచోట్ల సామూహిక సీమంతాలు చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు.


చినగుడిపాలలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన మంగళవారం మండల సర్వ సభ్యసమావేశం నిర్వహించను న్నట్లు ఎంపీడీఓ కల్యాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.